సాక్షి
మహబూబాబాద్

ఆదివారం । 17 । నవంబర్ । 2024



అయ్యప్ప మాలధారులకు..

శబరిమలకు వెళ్లే అయ్యప్ప మాలధారుల సౌకర్యార్థం కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ సంస్థ ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించింది.

- 8లో▸



జీడీపీలో 7.5 శాతం ఐటీదే..

దేశ జీడీపీలో 7.5 శాతం ఐటీ రంగానిదే నని, టెక్నాలజీ రంగంలో అపార ఉద్యోగావకాశాలు ఉన్నాయని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
36.1^0 / 17.3^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణంగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కరాటేలో నసీర్‌కు గోల్డ్‌మెడల్



మహబూబాబాద్ అర్బన్: ఇటీవల గోవాలో నిర్వహించిన వరల్డ్ కప్ కరాటే చాంపియన్‌షిప్‌లో షేక్ నసీర్ అండర్–17 విభాగంలో అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించారని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో శనివారం షేక్ నసీర్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీడీ, కోచ్ అభినందించారు.

రేపటి ప్రజావాణి రద్దు

మహబూబాబాద్: గ్రూప్ –3 పరీక్షలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నేపథ్యంలో రేపు (సోమవారం) కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది గ్రూప్–3 పరీక్షల నిర్వహణ, సర్వే విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేసినట్లు వెల్లడించారు.

'కొమ్మకుళ్లు' నివారణకు చర్యలు చేపట్టాలి



గార్ల: మిర్చి పంటలో ప్రస్తుతం ఆశిస్తున్న కొమ్మకుళ్లు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె మండల పరిధిలోని పుల్లూరు, చిన్నబంజర గ్రామాల్లోని మిర్చి తోటల్లో క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. మిర్చితోటల్లో కొమ్మ కుళ్లు తెగులు నివారణకు అజాక్సస్ట్రోబిన్, టేబుకొనాజోల్ మిశ్రమ మందులను ఎకరాకు 250 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. లేదా క్లోరోతలోనిల్, డైఫిన్కొనాజోల్ మిశ్రమ మందు ఎకరాకు 400ఎంఎల్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తెగులు తగ్గేవరకు యూరియా వాడవద్దని తెలిపారు. మిర్చితోటల్లో నల్లతామర నివారణకు జిగురు పూసిన పసుపు, నీలి, తెల్లరంగు అట్టలను ఎకరాకు 30 చొప్పున అమర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు తోటలకు పురుగు మందులను పిచికారీ చేయాలని సూచించారు. డీఏఓ వెంట మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు, ఏఈఓ పూజిత, రైతులు పాల్గొన్నారు.

'ప్రజల భ్రమలు తొలగిపోయాయి'



దోర్నకల్: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల భ్రమలు తొలగిపోయాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరన్న అన్నారు. స్థానిక వెంకటయ్యనగర్‌లోని బిషప్ అజరయ్య ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన సీపీఎం జిల్లా 3వ మహాసభలో ప్రారంభోపన్యాసం చేసి వీరయ్య మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హామీలైన ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రజల నుంచి ప్రభుత్వం భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తుండగా ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారని తెలిపారు. లగచర్ల ఘటనపై కలెక్టర్ స్పందన గొప్పగా ఉందన్నారు. రైతులు తనపై దాడి చేయలేదని కలెక్టర్ చెప్పి నిజాయతీగా వ్యవహరించారని తెలిపారు. గతంలో అనేక తప్పులు చేసిన బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి గొగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం పార్టీ నాయకులు జి.రాములు రచించిన స్ఫూర్తిదాతలు, నక్సలిజం నాకేమీ నేర్పింది పుస్తకాలను పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్యతో కలిసి వీరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా మహాసభలను పురస్కరించుకుని బైపాస్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించి వై.వెంకటయ్య నగర్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న, గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు బీఆర్.వీరస్వామి, మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్, గునిగంటి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

విదేశీ.. నిట్‌లో స్వదేశీ..

పరదేశీ విద్యార్థులను అక్కున చేర్చుకుంటున్న వరంగల్ నిట్

విదేశీయులం కాదు మేం ఓరుగల్లు స్వదేశీయులం అంటున్నారు.. నిట్ వరంగల్ క్యాంపస్‌లో విద్యనభ్యసిస్తున్న ఫారినర్స్. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన విద్యార్థులను అక్కున చేర్చుకుని నిట్ క్యాంపస్ అమ్మలా ఆదరిస్తోంది. వారి భద్రతకు పెద్దపీట వేస్తోంది. సొంతూరిలో ఉన్న అనుభూతిని కల్పిస్తోంది. ఇక్కడ చదువుకుంటున్న విదేశీ విద్యార్థులపై ఈ వారం 'సాక్షి' సండే స్పెషల్.

- కాజీపేట అర్బన్

సండే స్పెషల్

- దాసా అడ్మిషన్లతో ప్రతి ఏటా 90మందికి చోటు
- స్థానిక విద్యార్థులతో కలిసిపోతున్న ఫారినర్స్
- ఇక్కడి చారిత్రక ప్రదేశాలకు ఫిదా
- బతుకమ్మ పండుగ, సర్వపిండి ఎంతో ఇష్టమని వెల్లడి
- స్వదేశానికి వెళ్లినా ఓరుగల్లు సంస్కృతీసంప్రదాయాలకు గౌరవం



ఓరుగల్లులోని కాకతీయుల కాలం నాటి దేవాలయాలు, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలకు ఫిదా అయ్యాం - విదేశీ విద్యార్థులు





నిట్ వరంగల్‌లో విదేశీ విద్యార్థులు చేరేందుకు 2001లో అవకాశం కల్పించారు. ఇందుకు ప్రత్యేకంగా దాసా భవనం ఏర్పాటు చేశారు. కాగా.. ప్రతీ ఏడాది బీటెక్ ప్రథమ సంవత్సరంలోకి 1,300 మంది విద్యార్థులు జేఈఈ ప్రవేశ పరీక్ష ద్వారా జోసా అడ్మిషన్స్‌తో ప్రవేశం పొందుతున్నారు. 1,300 సీట్లలో 90 సీట్లను డైరెక్ట్ అడ్మిషన్ ఆఫ్ స్టూడెంట్స్ అబ్రాడ్(దాసా) పేరిట విదేశీ విద్యార్థులకు ప్రవేశం లభిస్తోంది. ఈ విద్యాసంస్థలో ఇండోనేషియా, రష్యా, ఖతర్, నేపాల్, నైజీరియా తదితర దేశాల విద్యార్థులు చదువుకుంటున్నారు.

అడ్మిషన్ ఫీజు తక్కువే..

విదేశాల్లో రూ.లక్షల్లో అడ్మిషన్ ఫీజులు ఉండగా.. నిట్ వరంగల్‌లో దాసా విద్యార్థులకు 42,500 అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. గల్ఫ్‌లో పనిచేస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు దాసా ద్వారా నిట్ వరంగల్‌లో అడ్మిషన్ పొందే అవకాశం ఉంటుంది. అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాబోధనతోపాటు క్యాంపస్ సెలక్షన్స్‌కు ప్రత్యేక వేదికగా నిలుస్తున్న నిట్ వరంగల్‌లో చేరేందుకు విదేశీయులు ఆసక్తి కనబరుస్తున్నారు.

భద్రత, స్నేహభావానికి ప్రతీక ఓరుగల్లు

విదేశీయులు తమ సొంత ఊరిలో ఎలా స్వేచ్ఛగా భద్రంగా జీవనం కొనసాగిస్తారో.. అంతకు మించి భద్రతను కల్పిస్తున్నది ఓరుగల్లు నగరం. ఇక్కడ విద్యనభ్యసించేందుకు తమ పిల్లలను పంపించేందుకు విదేశాల్లో ఉన్నవారు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక ఇక్కడి పండుగల్లో స్థానిక విద్యార్థులతో కలిసి విదేశీయులు పాల్గొంటున్నారు.

సంతోషంగా బతుకమ్మ ఆడుతా

మాది ఖతర్. నాకు నిట్ వరంగల్‌కు రావాలంటే మొదట భయం వేసింది. అడ్మిషన్ తీసుకున్నాక స్నేహితులు పెరిగారు. భయం పూర్తిగా తగ్గిపోయింది. మా దగ్గర లేని ఎన్నో పండుగలను నిట్ వరంగల్‌లో జరుపుకుంటాం. నాకు ప్రత్యేకంగా బతుకమ్మ ఆట అంటే చాలా ఇష్టం. ఎంతో ఉత్సాహంగా నేను మా స్నేహితులం బతుకమ్మ ఆడతాం. పండుగలు జరుపుకోవడం అంటే ఆనందం పంచుకోవడేమ కాకుండా పరస్పరం ఒకరి గురించి మరొకరం తెలుసుకునే అవకాశం ఉంటుంది.

- గాయత్రి, ఖతర్, మెకానికల్ సెకండియర్





వరంగల్ నిట్ క్యాంపస్‌లో స్థానిక విద్యార్థులతో కలిసి ముచ్చటిస్తున్న విదేశీ విద్యార్థులు, నిట్‌లో విదేశీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి భవనం

ఇంటిని తలపించే వాతావరణం



నిట్ వరంగల్ క్యాంపస్ సొంత ఇంటిని తలపించేలా ఉంది. నేను భూటాన్ నుంచి వచ్చినా కూడా.. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు అంటే చాలా ఇష్టమయ్యేలా నిట్ వరంగల్ నేర్పించింది. ప్రతీ ఏడాది సంక్రాంతి పండుగకు కైట్స్ ఎగురవేస్తున్నాం. దసరా, దీపావళి, హోలీ పండుగలను కలర్‌ఫుల్‌గా జరుపుకుంటున్నాం. భూటాన్‌లోని మా సొంత ఊరికి వెళ్లినప్పుడు తెలంగాణ పండుగలను మా వారికి పరిచయం చేస్తున్నా.

- సోనమ్ షెవాంగ్, భూటాన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సెకండియర్

తెలంగాణ ఫుడ్ చాలా ఇష్టం



నేను ఇండోనేషియా నుంచి నిట్ వరంగల్‌లో దాసా ద్వారా అడ్మిషన్ పొందిన తర్వాత ఇక్కడి ఫుడ్‌ను టేస్ట్ చేయడం ప్రారంభించా. నిట్‌లోని హాస్టల్స్‌లో అందించే నార్త్ ఇండియన్‌తోపాటు తెలంగాణ ఫుడ్స్ అంటే నాకు చాలా ఇష్టం. ప్రత్యేకంగా తెలంగాణ చికెన్, సర్వ పిండి ఎంతో ఇష్టంగా తింటాను. ఇండోనేషియాకు వెళ్లడం కంటే ఇండియాలోనే ఉండిపోవాలని ఉంది.

- ఫర్హాస్ చైదర్, ఇండోనేషియా, మెకానికల్ థర్డ్ ఇయర్

నిట్ చాలా బాగుంది..



నిట్ వరంగల్ క్యాంపస్ చాలా బాగుంది. అధ్యాపకులు, విద్యార్థులు ఎంతో ఫ్రెండ్లీగా ఉంటారు. రష్యా కంటే కూడా నిట్ వరంగల్ క్యాంపస్ ఎంతో సేఫ్ అనిపిస్తుంది. తరచూ నగరంలోని భద్రకాళి, వేయిస్తంభాల ఆలయం దర్శిస్తుంటా. నిట్ వరంగల్‌కు దగ్గరలో ఉన్న దాబాలో టేస్టీ ఫుడ్ తినడం చాలా ఇష్టం. ఎంటెక్ కూడా నిట్‌లో చేసేందుకు ప్రయత్నిస్తా. ప్రతీ ఏడాది నిట్‌లో నిర్వహించే టెక్నోజియాన్, స్ప్రింగ్‌స్ప్రీ ప్రోగ్రాంలో తెలుగు విద్యార్థులతో పోటీ పడి పాల్గొంటున్నా.

- సామ్రాట్, రష్యా, సీఎస్‌ఈ ఫోర్త్ ఇయర్

శివాలయం అభివృద్ధికి రూ.60 లక్షలు కేటాయిస్తా..



మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

గూడూరు: శివాలయ అభివృద్ధికి నిధులు రూ.60లక్షలు కేటాయిస్తానని ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన శివపార్వతుల కల్యాణం, లక్ష దీపోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో శివాలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రచారం ప్రారంభించానని తెలిపారు. ఆ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారని తెలిపారు. ఆ కోరిక మేరకు రూ.60లక్షలు కేటాయిస్తానని హామీ ఇవ్వడంతో కమిటీ సభ్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, గాదె సాగర్, పెసరి శివ, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, వాంకుడోతు కొమ్మాలు, మాజీ ఎంపీటీసీ కత్తి స్వామి, మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, అయిలబోయిన సమ్మక్క, నూకల శ్రీనివాస్, ఆలయ పూజారులు సతీష్‌పాండ్యే, ఆశీష్‌పాండ్యే, భానుశాస్త్రి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

కేసముద్రం: మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్ప దేవాలయంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకాల మహోత్సవంలో భాగంగా ఆలయంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ మేకల వీరన్న యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ అల్లం రమ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మహబూబాబాద్ రూరల్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ఈ మేరకు ఎస్పీ సూచనలతో జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఆవరణలో శనివారం పరిసరాల పరిశుభ్రత పనులు చేపట్టారు. మహబూబాబాద్ టౌన్, రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో పరిసరాల పరిశుభ్రత చర్యల్లో భాగంగా చెత్తాచెదారం పారవేసి పీఎస్‌లను సుందరంగా తీర్చిదిద్దారు. పోలీస్ స్టేషన్ల పరిసరాలు సుందరంగా ఉండేందుకు గాను ప్రతీ వారంలో ఒక రోజు గంట సమయాన్ని పనికి కేటాయించాలని ఎస్పీ సూచించారు.

గ్రూప్-3కి సర్వం సిద్ధం

- పరీక్ష రాయనున్న 7,592 మంది అభ్యర్థులు
- జిల్లా వ్యాప్తంగా 21 సెంటర్ల ఏర్పాటు
- 187మంది పోలీసుల బందోబస్తు



గ్రూప్-3 పరీక్షలకు జిల్లా కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: టీజీపీఎస్సీ గ్రూప్–3 పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేడు, రేపు రెండు రోజుల పాటు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 21పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 7,592 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అభ్యర్థులు ఐడెంటికోసం హాల్ టికెట్‌తో పాటు ఆధార్, పాన్ కార్డు లేదా ఇతర ప్రభుత్వం ఆమోదించిన గుర్తింపు కార్డులతో పరీక్షలకు రావాలి. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉండడంతో అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

163 సెక్షన్ అమలు

జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలలో బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుంది. 21సెంటర్లకు 21మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఆరుగురు రూట్ ఆఫీసర్లు, 24మంది జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు, 10మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 86మంది ఐడెంటిఫికేషన్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. పరీక్ష సెంటర్లకు నిరంతరం విద్యుత్ సరఫరాతో పాటు తాగునీరు, ఫస్టెయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. 21 పరీక్ష కేంద్రాలను 6 రూట్లుగా విభజించి ఒక్కో రూట్‌కు ఒక్కో జాయింట్ రూట్ ఆఫీసర్‌ను నియమించినట్లు తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, 86 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 187మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని వెల్లడించారు.

రెండు రోజులు పరీక్షలు

నేడు, రేపు రెండు రోజుల పాటు గ్రూప్– 3 పరీక్షలు జరగనున్నాయి. నేడు(ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు పేపర్ –1(జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ పరీక్ష), మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5: 30గంటల వరకు పేపర్ –2(హిస్టరీ, పొలిటికల్ అండ్ సొసైటీ) పరీక్ష జరగనుంది. అదే విధంగా 18 న(సోమవారం) ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు పేపర్ –3(ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) పరీక్ష ఉంటుంది.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ హైదరాబాద్ వారు విదేశాలలో ఉన్నత చదువులు చదవడానికి ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ పరీక్షల ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ శాఖ అధికారి బి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు అన్ని ఒరిజినల్, జిరాక్స్ పత్రాలు, 2 పాస్‌ఫొటోలు, ఆధార్‌కార్డులతో దరఖాస్తులు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 18 నుంచి 31 వరకు, ఆన్‌లైన్‌లో డైరెక్టర్ మైనార్టీ తెలంగాణ.జీమెయిల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 040 –23236112 లో సంప్రదించాలని తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి ప్రాంగణం

ప్రజా పాలన విజయోత్సవ సభా వేదికకు నామకరణం..

- ఓరుగల్లులోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఇందిర జయంతి రోజునే బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన టీపీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- ప్రజాప్రతినిధులతో బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ భేటీ.. దిశానిర్దేశం



విలేకరులతో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రులు శ్రీధర్‌బాబు, సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితరులు



హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని పరిశీలిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ప్రావీణ్య

సాక్షిప్రతినిధి, వరంగల్/హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వేడుకలకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రజాపాలన విజయోత్సవాల కోసం శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశం జరగగా.. శనివారం మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ హనుమకొండలో ఏర్పాట్లు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి నేరుగా హనుమకొండకు చేరుకున్న టీపీసీసీ చీఫ్, మంత్రుల బృందానికి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

ఉమ్మడి జిల్లా నేతలతో భేటీ..

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ నెల 19న హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవసభ ఏర్పాట్లు, జన సమీకరణ, సక్సెస్‌పై గంటన్నరకు పైగా ఆయన ఈ కీలక భేటీ నిర్వహించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి రోజున నిర్వహించే ఈ విజయోత్సవ సభా వేదికకు 'ఇందిరా మహిళా శక్తి ప్రాంగణం'గా నామకరణం చేశారు. ప్రజలను తరలించే వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా సీఎం కాన్వాయి ఇందిరా మహిళా శక్తి ప్రాంగణానికి చేరేలా చూడాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి హెలిప్యాడ్ స్థలం ఫైనల్ చేసే అవకాశం ఉంది. కాగా, ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రెండు లక్షల మందిని తరలించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో లక్ష మంది మహిళలు ఉండేలా చూడాలని టీపీసీసీ చీఫ్ ప్రజాప్రతినిధులకు సూచించినట్లు సమాచారం. జన సమీకరణ, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభం, ఏర్పాట్లపై నేడు, రేపు అధికారులతో మంత్రులు, ఎమ్మెల్యేలు చర్చించాలన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి: టీపీసీసీ చీఫ్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. హనుమకొండలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు అన్యాయం జరిగిందని.. విద్య, వైద్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే రేవంత్‌రెడ్డి సర్కారు ఆయా రంగాలను అభివృద్ధి చేసేందుకు ముందుకెళ్తోందని పేర్కొన్నారు. రూ.18 వేల కోట్లతో రైతులకు రుణమాఫీ చేసిందని, 40 శాతం కాస్మోటిక్స్ చార్జీలు పెంచి విద్యార్థులకు అండగా నిలిచిందని తెలిపారు. కేసీఆర్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇస్తే ఫాంహౌస్‌కే పరిమితమయ్యాడని విమర్శించారు. పదేళ్లలో నిరుద్యోగులను విస్మరించి తన కుటుంబ సభ్యులకు మాత్రం రాజకీయ ఉద్యోగాలు ఇచ్చాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉంటుందని, సైద్ధాంతిక పరంగా విమర్శించుకున్నా అవసరమైనప్పుడు అందరం కలిసే పనిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని 'ఇందిరా మహిళా శక్తి ప్రాంగణం'లో సభావేదిక ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను కలెక్టర్ ప్రావీణ్య.. వారికి వివరించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ సుధారాణి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ రియాజ్, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, సాట్ చైర్మన్ శివసేనారెడ్డి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్రాప్‌లోన్‌ సమానంగా పంచలేదని..

- పెద్దకుమారుడి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

నెల్లికుదురు: వ్యవసాయ భూమికి సంబంధించిన క్రాప్‌ లోన్‌ ఇద్దరికి సమానంగా పంచివ్వలేదనే కారణంతో పెద్ద కుమారుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా నెల్లికుదురు మండలం దుర్గాభవాని తండా శివారు రామోజీ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్‌ బాబు కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్‌ మంగ్యాకు ఇద్దరు కుమా రులు. పెద్ద కుమారుడు దేవేందర్‌ (40) తన తండ్రి వ్యవసాయ భూమికి సంబంధించిన క్రాప్‌లోన్‌ ఇద్దరికి సమానంగా పంచి ఇవ్వలేదని మనస్తాపం స్థాపం చెంది ఈ నెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్‌ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

పెద్దవంగర: బైక్‌ను కారు ఓవర్‌ టేక్‌ చేస్తూ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన దున్న సతీశ్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌ వెళ్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాంబశివరావు బాతులు కాసుకుంటూ మండల పరిసర ప్రాంతాల్లో ఉంటున్నాడు. తన బైక్‌పై పెద్దవంగరకు వెళ్తుండగా తహసీల్దార్‌ కార్యాలయం సమీపం చేరుకుంటున్న క్రమంలో బైక్‌ను ఓవర్‌ టేక్‌ చేయబోయి కారు ఎదురుగా వస్తున్న పెద్దవంగరకు చెందిన రఘుపతి ట్రాక్టర్‌ను కారు ఢీకొంది. దీంతో కారు, ట్రాక్టర్‌ డ్రైవర్లతో పాటు ద్విచక్ర వాహనదారుడి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై క్రాంతికిరణ్‌ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను తొర్రూరులో ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అయ్యప్ప మాలధారులకు ఆన్‌లైన్‌ సేవలు..

స్వామి శరణం.. అయ్యప్ప శరణం, స్వామియే శరణమయ్యప్ప అంటూ భక్త జన కోటి దీక్షలు చేపడుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో మాలధారులు కఠిన నియమాలు ఆచరిస్తున్నారు. 41 రోజులపాటు దీక్షలు పాటించి ఇరుముడులతో శబరిమలకు వచ్చే మాలధారుల సౌకర్యార్థం కేరళ ప్రభుత్వం అనేక సేవలతో కూడిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. అయ్యప్ప సన్నిధానంలో లభించే వసతి, ట్రాఫిక్‌, వైద్యసేవలు, ఎస్‌ఎంఎస్‌ సేవలు, సూచనలు, ఆలయానికి వచ్చే మార్గాలు తదితర వివరాలను ఇందులో పొందుపరిచింది. మాలధారులకు అందించే సేవలు తెలుగులోనూ పొందుపరిచారు. ఆ సేవలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.


శబరిమలలో పదునెట్టంబడి ఎక్కుతున్న అయ్యప్పమాలధారులు

ప్రత్యేక వెబ్‌సైట్‌ రూపొందించిన ట్రావెన్‌కోర్‌ సంస్థ

- తెలుగులో శబరిమల సమాచారం
- వైద్యసేవల కోసం యాప్‌

కాజీపేట: శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప మాలధారుల సౌకర్యార్థం కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్‌ సంస్థలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ఇందులో భాగంగా వెబ్‌సైట్‌ రూపొందించి అందులో ముందస్తు రిజర్వేషన్‌కు అవకాశం కల్పించింది. వైద్య సేవల కోసం సంప్రదించేందుకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయ్యప్ప సన్నిధిలో దర్శనం, వసతి అనుకున్న సమయానికి జరిగేలా ఏర్పాట్లు చేశారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ శబరిమల.కామ్‌ వెబ్‌సైట్‌ను ఓపెన్‌ చేసి శబరిమల యాత్రను మనకు అనుకూలంగా మార్చుకోవచ్చు. ఈ వెబ్‌సైట్‌ను తెలంగాణ పోలీసుశాఖ అధికారిక వెబ్‌సైట్‌కు అనుసంధానించడం మరో ప్రత్యేకత.

ఆన్‌లైన్‌లో టికెట్‌ పొందాలంటే...

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. శబరిమల కేరళ పోలీస్‌. జీవోవి.ఇన్‌ వెబ్‌సైట్‌లోకి లాగిన్‌ కాగానే కనిపించిన ముఖ చిత్రం పైభాగంలో ఇంగ్లిష్‌, మళయాలం, తమిళం, కన్నడ, తెలుగు భాషలు కనిపిస్తాయి. తెలుగు వద్ద క్లిక్‌ చేస్తే ఈ వెబ్‌సైట్‌లో సమాచారం తెలుగులోకి మారుతుంది. దీంతో కావాల్సిన సమాచారం తెలుగులో పొందొచ్చు. వెబ్‌సైట్‌ ముఖ చిత్రం పైభాగంలో పర్చువల్‌ క్యూ బుకింగ్‌ వద్ద క్లిక్‌ చేస్తే శబరిమల పర్చువల్‌ మరో పేజీ కనిపిస్తుంది. అక్కడ సెర్చ్‌డ్‌ బుక్‌ క్యూ కూపన్‌ వద్ద క్లిక్‌ చేస్తే దర్శనానికి ఖాళీ ఉన్న రోజుల సమాచారం కనిపిస్తుంది. మనకు కావాల్సిన తేదీ, సమయం మార్క్‌ చేసి స్లాట్‌ బుక్‌ చేసుకోవచ్చు. అక్కడే వివరాలు ఇచ్చాక రెండోసారి లాగిన్‌లోకి వెళ్లి సెల్‌కు వచ్చిన ఓటీపీ కోడ్‌ను టైప్‌చేసి టికెట్‌ పొందొచ్చు. ఆన్‌లైన్‌లో దర్శనం టికెట్‌ నమోదుకు పాస్‌పోర్టుసైజ్‌ ఫొటో, చిరునామా ధ్రువీకరణకు ఆధార్‌ లేదా ఓటర్‌కార్డు అవసరమవుతాయి. టికెట్‌ పొందిన వారిని కేరళ పోలీసులు రద్దీ తక్కువగా ఉండే మరో మార్గంలో దైవదర్శనం కోసం అనుమతిస్తారు. ఈ క్యూలో వెళ్లిన వారిని సన్నిధానానికి అందరూ వచ్చే చోట కలుపుతారు.

అందుబాటులో వైద్య సేవలు..

యాత్ర సమయంలో అనారోగ్యానికి గురైన భక్తులకు వైద్య సేవలు అందించేందుకు కేరళ ప్రభుత్వం సమీపంలో ఉన్న ఆసుపత్రుల సమాచారాన్ని అందుబాటులో ఉంచింది. పంబ, శబరిమల, అప్పాచిగుడి, నీలిమెల ప్రాంతాల్లో గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఆసుపత్రులున్నాయి. ఇందుకు సంబంధించి పంబ ఆసుపత్రి 04735-202050, 04735-203384, 04735-203318, ప్రభుత్వ హోమియో వైద్యశాల 04735-203537, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల 04735-202536 నంబర్లను అందుబాటులో ఉంచింది. వీటితో పాటు అత్యవసర వైద్య సేవలకు సకల సౌకర్యాలతో కూడిన వాహనాలను కూడా అందుబాటులో ఉంచింది.

- టోల్‌ఫ్రీ నంబర్‌ 1800-425-6656,
- పోలీస్‌ కంట్రోల్‌ రూం నంబర్‌ (పంబ) 04735-203386,
- పోలీస్‌ కంట్రోల్‌ రూం (సన్నిధానం) 04735-202016,
- పోలీస్‌స్టేషన్‌ (పంబ) 04735-203412,
- పోలీస్‌స్టేషన్‌ (సన్నిధానం) 04735-202014,
- హైవే అలర్ట్‌ (కేరళ పోలీసు) 098461-00100,
- రైల్వే అలర్ట్‌ (కేరళ పోలీస్‌) 098462-00200,
- హైవే పోలీస్‌ (పథనం థిట్ట) 04735-202101

సన్నిధానంలో వసతికి..

అయ్యప్ప మాలధారులకు స్వామి వారి దర్శనంతో పాటు వసతి సౌకర్యాలను ఆన్‌లైన్‌ ద్వారా పొందొచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శబరిమల.కేరళ.జీవోవి.కామ్‌లో వసతి సౌకర్యాలు పొందుపర్చింది. ఈ వెబ్‌సైట్‌లోకి లాగిన్‌ అయ్యి పరిశీలిస్తే పంబ, శబరిమలలో మాలధారులు బస చేసేందుకు అతిథి గృహాలు, షెడ్లు, డార్మెటరీల వివరాలు లభిస్తాయి.

ఎస్‌ఎంఎస్‌తో సాయం..

కేరళ పోలీసు శాఖ మరో సులువైన సౌకర్యం కల్పిస్తోంది. యాత్రకు సంబంధించి ఎలాంటి వివరాలు, ఆసుపత్రులు, భద్రత ఇతర వివరాలను ఎస్‌ఎంఎస్‌ల ద్వారా మన సెల్‌ఫోన్‌లకు అందిస్తుంది. అయితే వీరి సేవలు వోడాఫోన్‌, బీఎస్‌ఎన్‌ఎల్‌ నెట్‌వర్క్‌ వినియోగదారులకు మాత్రమే.



- శబరిమలలో క్యూలైన్లు ఎన్ని గంటలు నడుస్తోందో తెలుసుకోవడానికి ఎస్‌ఎంబీఎల్‌ స్పేస్‌ ఇచ్చి క్యూ అని టైపు చేసి 537252కు ఎస్‌ఎంఎస్‌ పంపితే వివరాలు కనిపిస్తాయి.
- పార్కింగ్‌ సౌకర్యం తెలుసుకోవడానికి ఎస్‌ఎంబీఎల్‌ స్పేస్‌ ఇచ్చి పి అని, వాతావరణ పరిస్థితుల కోసం ఎస్‌ఎంబీఎల్‌ స్పేస్‌ ఇచ్చి డబ్ల్యూ అని టైప్‌ చేసి 537252 నంబర్‌కు పంపాలి. అత్యవసర సాయం కోసం పోలీసులు కొన్ని ఫోన్‌ నంబర్లు కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకవేళ ఫోన్లు పని చేయని పక్షంలో ఎస్‌ఎంబీఎల్‌ స్పేస్‌ ఇచ్చి హెల్ప్‌ మరోమారు స్పేస్‌ ఇచ్చి మనకు ఎటువంటి సాయం కావాలో ఆంగ్లంలో రాసి 537252కు మెసెజ్‌ పంపాలి. ఇది నేరుగా పోలీస్‌ కంట్రోల్‌ రూమ్‌నకు వెళ్తుంది. ఆ తరువాత అత్యవసర సేవలు అందిస్తారు. మీరు మీ బృందం నుంచి తప్పిపోయిన ఇలాగే మెసెజ్‌ పంపాలి. యాత్రలో ఎలాంటి విలువైన వస్తువులు పోయిన వెంటనే స్థానిక పోలీసులను కలవడం ఉత్తమం.

రామాలయంలో చోరీ

- సీతారామలక్ష్మణుల పంచలోహ విగ్రహాలు అపహరణ


నిందితుల కోసం గాలిస్తున్న డాగ్‌ స్క్వాడ్‌ బృందం

కమలాపూర్‌: కమలాపూర్‌ మండలం శనిగరంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడి సీతారామలక్ష్మణుల పంచలోహ విగ్రహాలు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్‌ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు సిబ్బందితో కలిసి ఆలయాన్ని పరిశీలించి జిల్లా కేంద్రం నుంచి క్లూస్‌ టీంను రప్పించారు. నిపుణులు వేలిముద్రలు సేకరించారు. డాగ్‌ స్క్వాడ్‌తో నిందితుల కోసం గాలించగా డాగ్‌ గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావి చుట్టూ తిరగడంతో చోరీ చేసిన విగ్రహాలను అందులో పడేసి ఉంటారని భావించి ఆ బావిలోని నీరు తోడుతున్నారు. దీనిపై గ్రామస్తుడు భీమిలి మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ హరికృష్ణ తెలిపారు.

'రైల్వే పరిధిలో రీల్స్‌ చిత్రీకరిస్తే కేసులు'

కాజీపేట రూరల్‌: రైల్వే పరిధిలో కాని రైళ్లలో, రైళ్లపై నిలబడి, ప్రయాణిస్తూ రీల్స్‌ చిత్రీకరిస్తే వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామని కాజీపేట ఆర్పీఎఫ్‌ సీఐ ఎం.సంజీవరావు శనివారం తెలిపారు. రైల్వే ప్రయాణ ప్రాంగణం, రైళ్లపై, రైల్వే పరిధిలో సోషల్‌ మీడియాలో రీల్స్‌ చేసే వారిపై కేసులు నమోదు చేయాలని రైల్వేబోర్డు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. యువకులు కదులుతున్న రైళ్లలో, రైల్వే ట్రాక్‌లపై ప్రమాదకరంగా స్టంట్స్‌తో వీడియో రీల్స్‌ చిత్రీకరిస్తూ వారు ప్రమాదంలో పడడంతో పాటు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అలాంటి రీల్స్‌ చేసే వారిపై కేసులు నమోదు చేయాలని రైల్వే బోర్డు అన్ని రైల్వే జోన్ల పోలీస్‌ అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి



మంగపేట : మండలంలోని మల్లూరు గుట్టపై గల హేమాచల క్షేత్రంలోని స్వయంభు లక్ష్మీనర్సింహ స్వామిని శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రం నుంచే కాకుండా పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి గుట్టపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తైలాభిషేకం పూజలు నిర్వహించారు. ప్రతి శని, ఆదివారం ప్రత్యేకంగా నిర్వహించే స్వామివారి తిల తైలాభిషేకం పూజలో పాల్గొని మానవ శరీరాన్ని పోలిఉండే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం.భక్త జనంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.



మూఢ నమ్మకాల పేరిట రూ.55 లక్షల టోకరా

- ట్రాన్స్‌ జెండర్‌తో పాటు నలుగురి అరెస్ట్‌
- రూ.34లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ వెల్లడి


మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్‌, పక్కన ఏసీపీ, సీఐ

జనగామ : మాయలు చేస్తాం.. మంత్రాలు చేస్తాం.. దోషాలను నివారిస్తామంటూ మాయ మాటలతో బురిడీ కొట్టిస్తూ అమాయకులను మోసానికి గురిచేస్తూ లక్షలాది రూపాయలు దండుకున్న ముఠాను జనగామ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌.. ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్‌ భట్టు నాగదేవికి మూడేళ్ల క్రితం జనగామ పట్టణం బాణాపురానికి చెందిన కారు డ్రైవర్‌ పాముకుంట్ల సందీప్‌ పరిచయమయ్యాడు. 2023 అక్టోబర్‌ 10న ఇద్దరు వివాహం చేసుకున్నారు. నాగదేవి భిక్షాటన ద్వారా వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారన్నారు. ఇందులో భాగంగా జనగామ పట్టణానికి చెందిన సిరివెన్నల, ఆమె తమ్ముడు నిఖిల్‌ వద్దకు 2024 అక్టోబర్‌ 1వ తేదీన ట్రాన్స్‌జెండర్‌, ఆమె భర్త సందీప్‌ వెళ్లారు. అక్క, సోదరుడిని బురిడీ కొట్టిస్తూ మీ ఇంట్లో ఉన్న దోషాలను తొలగించేందుకు పూజలు చేస్తామంటూ మాయ మాటలతో వెన్నల నుంచి ఆమె తమ్ముడి ద్వారా పలు దఫాలుగా రూ.55లక్షల నగదు, ప్లాట్‌ డాక్యుమెంట్లను తీసుకున్నారు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఏసీపీ ఆధ్వర్యంలో సీఐ నెహ్రూ పార్కు వద్ద వాహనాలు తనిఖీ చేసే సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన నాగదేవి, భర్త సందీప్‌, వారికి సహకరించిన మెతుకు గణేశ్‌, గుగులోత్‌ నవీన్‌, భూక్యా గణేశ్‌.. మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో నిందితుల నుంచి 30 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.10 లక్షల విలువైన భూమి రిజిస్ట్రేషన్‌ పత్రాలు, కారుతో పాటు ముత్తూట్‌ ఫైనాన్స్‌లో ఉన్న 4.6 గ్రాముల బంగారం డిపాజిట్‌ రశీదులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ చెప్పారు.

రైతుల ఫిర్యాదుతో పంటల పరిశీలన


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త వెంకన్న

శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామ రైతులు పండించిన జైశ్రీరామ్‌ గోల్డ్‌ వరి పంట క్షేత్రాలను ఆర్‌ఏఆర్‌ఎస్‌ వరి విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ వి. వెంకన్న శనివారం పరిశీలించారు. సదరు రైతులు శాయంపేట సాయి ఫర్టిలైజర్‌లో యశోద కంపెనీకి చెందిన జైశ్రీరామ్‌ గోల్డ్‌ వరి విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేశారు. కల్తీ విత్తనాలతో పంట నష్టపోయామని ఈ నెల8న ఏఓ గంగా జమునకు ఫిర్యాదు ఇవ్వగా ఆమె జిల్లా వ్యవసాయ అధికారికి లేఖ రాశారు. దీంతో డీఏఓ ఆదేశాల మేరకు ఆర్‌ఏఆర్‌ఎస్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ వెంకన్న.. తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ సీడ్‌ ఆఫీసర్‌ నివ్యక్‌తో కలిసి పంట క్షేత్రాలను పరిశీలించారు. మారజోడి నిరంజన్‌రావు, రాయరాకుల మొగిలితో పాటు మరి కొంత మంది రైతుల పంట క్షేత్రాలను పరిశీలించి మంచి, కల్తీ విత్తనాల గొలుసులను లెక్కించి నమోదు చేసుకున్నారు. మీటర్‌ స్క్వేర్‌ కొలత ఆధారంగా సీడ్స్‌ సేకరించామని, వారం రోజుల్లో నివేదికను డీఏఓకు అందజేస్తామని శాస్త్రవేత్త వెంకన్న తెలిపారు. నివేదిక ఆధారంగా డీఏఓ చర్యలు తీసుకుంటారని తెలిపారు.

జీడీపీలో 7.5 శాతం ఐటీ రంగానిదే

- కేయూ వీసీ ప్రతాప్‌ రెడ్డి
- ఘనంగా కిట్స్‌ గ్రాడ్యుయేషన్‌ ఉత్సవం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ ప్రతాప్‌ రెడ్డి, ఎంపీ, చైర్మన్‌ లక్ష్మీకాంతారావు

హసన్‌పర్తి : ఇండియా బ్రాండ్‌ ఈక్విటీ ఫౌండేషన్‌ ప్రకారం దేశ జీడీపీలో 7.5 శాతం ఐటీ రంగానిదేనని, టెక్నాలజీ రంగంలో అపార ఉద్యోగావకాశాలు ఉన్నాయని కేయూ వీసీ కె. ప్రతాప్‌ రెడ్డి తెలిపారు. శనివారం వరంగల్‌ కిట్స్‌ కళాశాల క్యాంపస్‌లో 2020–2024 సంవత్సర బ్యాచ్‌ విద్యార్థుల 41వ వార్షిక గ్రాడ్యుయేషన్‌ డే ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు, కిట్స్‌ గవర్నింగ్‌ బాడీ చైర్మన్‌ కెప్టెన్‌ వి. లక్ష్మీకాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్‌ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి ఇంజనీర్‌గా పరిశ్రమలో ఉత్తమంగా సరిపోయేలా క్రిటికల్‌ థింకింగ్‌, స్టార్టప్‌, పర్యావరణ వ్యవస్థలకు సంబంధించిన నైపుణ్యాల ద్వారా సమస్య పరిష్కార సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. స్టార్టప్‌ల ద్వారా కార్పొరేట్‌ పారిశ్రామిక కార్యాలయాలను ప్రారంభించి వినూత్న నైపుణ్యాల మెరుగుదల కోసం పాటుపడాలన్నారు. ఎంపీ, చైర్మన్‌ లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ కిట్స్‌ వరంగల్‌ బహుళజాతి కంపెనీలు, ప్రభుత్వ పరిశోధన కేంద్రాలతో మొత్తం 35 ఎంఓయూలు కలిగి ఉందన్నారు. ఇన్‌స్టిట్యూట్‌.. బహుళజాతి కంపెనీలలో 2022–23లో 82శాతం, 2023–24లో 61శాతం ఉద్యోగిత సాధించామని, తమ కళాశాల పూర్వ విద్యార్థులు 27,150 మంది ప్రపంచంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. అకడమిక్‌ అండ్‌ కోకరికులర్‌ ఆక్టివిటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 28 మంది విద్యార్థిని విద్యార్థులకు బంగారు పతకాలు, అకడమిక్‌ మెరిట్‌ అవార్డులు, డిగ్రీలు అందజేసినట్లు ప్రిన్సిపాల్‌ కె. అశోకరెడ్డి తెలిపారు. కేయూ రిజిస్ట్రార్‌ పి.మల్లారెడ్డి, కోశాధికారి పి.నారాయణరెడ్డి, కిట్స్‌ యాజమాన్య కమిటీ సభ్యులు వి.సతీశ్‌ కుమార్‌, వి. కిషన్‌రావు, ఇ. వెంకట్రామ్‌ రెడ్డి, కె. దేవి ప్రసాద్‌, ఎ. సత్యనారాయణ రాజు, డా. వి.పవన్‌, కె. ప్రతాప్‌ రెడ్డి, ఎ. హరీశ్‌, వి. శ్రీరామ్‌ రావు, కిట్స్‌ రిజిస్ట్రార్‌ ఎం. కోమల్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి వి. రాజగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు


వలీపాషా (ఫైల్‌)

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన షేక్‌ వలీపాషా టెంట్‌హౌస్‌ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బైక్‌పై సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్‌లో ఉంటున్న తన అత్తగారి ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో పర్సాయపల్లి గ్రామానికి చెందిన జంపాల సైదులు, తన భార్య శైలజతో కలిసి బైక్‌పై అడివెంల గ్రామం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ రెండు బైక్‌లు పర్సాయపల్లి గ్రామ స్టేజీ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వలీపాషా, సైదులు, శైలజకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సూర్యాపేట జిల్లా జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. వలీపాషా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. మృతుడి భార్య హమీదాబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్‌. బాలకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడు..


నగేశ్‌ (ఫైల్‌)

ఏటూరునాగారం: చేపల వేటకు వెళ్తున్న ఓ మత్స్యకారుడిని బైక్‌ ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం 163 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఏఎస్సై సుబ్బారావు కథనం ప్రకారం.. మండ కేంద్రంలోని ఓడవాడ ప్రాంతానికి చెందిన గగ్గూరి నాగేశ్‌(44) తన ద్విచక్రవాహనంపై ముళ్లకట్ట వద్ద గోదావరిలో చేపల వేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎంజే ఫంక్షన్‌హాల్‌ వద్ద మరో ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొనడంతో నగేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుబ్బారావు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో వ్యక్తి ..


శ్రీను (ఫైల్‌)

పెద్దవంగర: చేపలు పట్టేందుకు చెరువులోకి వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్చిరాం తండాలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్‌ కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్‌ శ్రీను (50) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, శనివారం గ్రామ శివారు పెద్దచెరువు అలుగు కాల్వ నీటిలో విద్యుత్‌ సాయంతో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్‌ తీగ తగలడంతో షాక్‌కు గురై కుంటలో పడ్డాడు. ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరకోగా మృతి చెంది కనిపించాడు. ఈ ఘటనపై భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్‌ తెలిపారు.


ఉత్సాహంగా బాక్సింగ్‌ ఎంపికలు


బాక్సింగ్‌ పోటీలను ప్రారంభిస్తున్న బాక్సింగ్‌ సంఘం మాజీ అధ్యక్షుడు సుభాశ్‌రెడ్డి

వరంగల్‌ స్పోర్ట్స్‌: పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్‌–14, 17 ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి బాక్సింగ్‌ ఎంపిక పోటీలు శనివారం హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్‌ హాల్‌లో నిర్వహించారు. అండర్‌–14 విభాగంలో బాలురకు, అండర్‌–17లో బాలబాలికలకు నిర్వహించిన ఎంపిక పోటీలకు వరంగల్‌ జిల్లా బాక్సింగ్‌ అసోసియేషన్‌ మాజీ అధ్యక్షుడు చాడ సుభాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో ఆడి పతకాల సాధించాలన్నారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్‌ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రూ నాయక్‌ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల చివరివారంలో హైదరాబాద్‌లో జరగనున్న ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్‌ వాణి, పీఈటీలు శీలం పార్థసారథి, శ్రీధర్‌రావు, చిర్ర రఘు, శోభ, సీనియర్‌ బాక్సర్లు కుమారస్వామి, రాజేశ్‌ఖన్నా, అనిల్‌, బాక్సింగ్‌ కోచ్‌లు సందెల శ్యాంసన్‌, దేవరకొండ ప్రభుదాస్‌ పాల్గొన్నారు.

వర్తక సంఘంలో అన్ని కమిటీలు రద్దు

- నెల రోజుల తర్వాత నూతన కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- అప్పటి వరకు ఎవరికి వారే..


లక్ష్మీపురం మార్కెట్‌

వరంగల్‌ : వరంగల్‌ లక్ష్మీపురం మార్కెట్‌లోని వరంగల్‌ కమీషన్‌ కూరగాయల వర్తక సంఘం అడ్‌హక్‌ కమిటీని రద్దు చేస్తూ శనివారం మార్కెట్‌లో సమావేశమైన వ్యాపారులు తీర్మానం చేసినట్లు తెలిసింది. మూడు నెలల క్రితమే కమిటీని రద్దు చేసి దాని స్థానంలో కొత్త కమిటీ ఎన్నిక కోసం అడ్‌హక్‌ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ కూడా సరైన సమయంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించలేకపోయింది. ఈ సంఘంలో ఇద్దరు, ముగ్గురు అధ్యక్షులుగా పోటీ పడుతుండగా ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేద్దామని కొంత మంది యత్నాలు చేసినా సాధ్యం కాలేదు. దీనికి తోడు ఇటీవల మార్కెట్‌లో పర్యటించిన మంత్రి కొండా సురేఖ అర్హతలు లేని వారికి, రాజకీయ పలుకుబడి ఉన్న వారికి ప్లాట్లు కేటాయించినట్లు సమాచారం ఉందని, క్షేత్ర స్థాయిలో వారిని గుర్తించి వారి స్థానంలో వ్యాపారం చేసే వారికి కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ నిర్ణయం సంఘంలో కలకలం రేపింది. కొంత మంది తమ పేర మడిగెలు ఉన్నప్పటికీ ఓపెన్‌ ప్లాట్లు, కవర్‌ షెడ్‌లలో ప్లాట్లు పొందడంపై మార్కెట్‌ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ప్లాట్లు లేని వ్యాపారులు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదుతో ప్లాట్లు రద్దు చేసేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈవిషయంతో పాటు అనుమతి లేకుండా షాపుల ఎదుట ఏర్పాటు చేసిన షెడ్‌లను తొలగించాలని వ్యాపారులకు మార్కెట్‌ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ సమస్యలపై సంఘం నాయకులు పట్టించుకోవడం లేదనే అభిప్రాయం కొంత మంది వ్యాపారుల్లో నెలకొంది. అదనంగా ప్లాట్లు తీసుకోలేదని, తీసుకున్న వారి ప్లాట్లు పోతే మాకేంటి అన్న అభిప్రాయాలు కొంత మంది వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది. వ్యాపారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే కొత్త కమిటీ ఏర్పాటు జాప్యం అవుతోందనే కారణంతో మొత్తం కమిటీలను రద్దు చేస్తున్నట్లు సమావేశంలో నిర్ణయించారు. కమిటీ రద్దు అయిన నేపథ్యంలో నెల రోజుల పాటు వ్యాపారులు తమ ఇబ్బందులు తామే పరిష్కారం చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం నెల రోజుల తర్వాత నూతన కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సమావేశంలో సభ్యులు తీర్మానం చేసినట్లు కొందరు వ్యాపారులు తెలిపారు.